

సాక్షి
బాపట్ల

మంగళవారం । 27 । ఆగస్టు । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం సోమవారం 589.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,104 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ 45.51 టీఎంసీలకు చేరింది. ఎగువ నుంచి 32708 క్యూసెక్కులు చేరుతుండగా దిగువకు 33268 క్యూసెక్కులు వదలుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 7508 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 330 క్యూసెక్కులు విడుదల చేశారు.



కఠిన శిక్షలతోనే అడ్డుకట్ట

మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించాలన్నా.. అత్యాచారాలకు, హత్యలకు పాల్పడాలనే ఆలోచన రావాలన్నా కూడా మృగాళ్లు భయపడేటట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు చేయాలి. ప్రభుత్వాలు చట్టాలు చేసి అత్యంత కఠినంగా అమలు చేసినప్పుడే సమాజంలో మార్పు వస్తుంది. మానవ మృగాలపై ఏ మాత్రం దయ చూపకుండా శిక్షలు విధించాలి.

– దూళ్ల స్నేహ, ఏఎన్ఎం, రేపల్లె కమ్యూనిటీ వైద్యశాల



వైద్యుల ప్రాణాలకే రక్షణ లేకపోతే ఎలా?

నిస్వార్థంగా వైద్యసేవలు అందించి రోగుల ప్రాణాలు కాపాడే వైద్యులు దైవ సమానులు. అటువంటి వైద్యులకు నేడు రక్షణ లేకుండా పోతోంది. రాత్రిళ్లు విధులు నిర్వహించాలంటేనే భయపడే రోజులు వచ్చాయి. ఎన్ని చట్టాలు చేసినా అత్యాచారాలు, హత్యలు తగ్గని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వాలు మహిళలపై దౌర్జన్యాలకు, అత్యాచారాలకు పాల్పడే మృగాళ్లను కఠినంగా శిక్షించేలా చట్టాలను చేయాలి.

– నిర్మల సరస్వతి, హెడ్‌నర్స్, నగరం ప్రాథమిక వైద్యశాల



న్యూస్‌రీల్

పంగులూరులో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

సెప్టెంబర్ 20,21,22 తేదీల్లో నిర్వహణ



జే.పంగులూరు: పంగులూరులో సెప్టెంబర్ 20,21,22 తేదీల్లో అండర్–14 విభాగంలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచు గరటయ్య సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గరటయ్య మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో ఇప్పటికి 10 సార్లు రాష్ట్ర ఖోఖో పోటీలు, 3 సార్లు జాతీయ స్థాయి ఖోఖో పోటీలు అంత్యత వైభవంగా నిర్వహించనట్లు తెలిపారు. ఈ దఫా పోటీలను సైతం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యులు రాయిణి ప్రమీళ వెంకటసుబ్బారావు, మండల ఉపాధ్యక్షుడు యర్రం శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి కాశీ విశ్వనాథరెడ్డి, ట్రెజరర్ హనుమంతురావు, రొటేరీయన్లు వీరరాఘవయ్య, సింగర్, సాంబశివరావు, హనుమంతురావు, సుబ్బారావు గ్రామస్తులు పాల్గొన్నారు.

అమరేశ్వరాలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

అమరావతి: అమరావతిలోని అమరేశ్వర స్వామి దేవస్థాన క్షేత్ర పాలకుడైన వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకుని ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలయ ఈఓ వేమూరి గోపినాథశర్మ ఆధ్వర్యంలో అర్చక స్వామి కేశవాచార్యులు స్వామివారికి వేకువజామున పంచసూక్తాలతో పంచామృత స్నపన నిర్వహించి పలు రకాల పుష్పాలతో స్వామివారికి అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి సహస్రనామ పూజ నిర్వహించి భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో ఉట్టి కొట్టే కార్యక్రమం వేడుకగా నిర్వహించారు.

ముగిసిన అమరేశ్వరుడి పవిత్రోత్సవాలు



అమరావతి: అమరావతిలోని అమరేశ్వరాలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు వేద పండితులు శాస్త్రోక్తంగా పూర్ణాహుతితో నిర్వహించారు. మండప పూజలు, మండప దేవతాహోమాలు, ప్రాయశ్చిత్త హోమం, పూర్ణాహుతి, కలశోద్వాసన, మార్జనం, ఆశీర్వచనం నిర్వహించారు. దాతలు యార్లగడ్డ ఉపేంద్ర, విజయలక్ష్మి సహకారంతో నిర్వహిస్తున్న ఈ పవిత్రోత్సవాలతో మూడో రోజున ఉపాలయాలలో పూజలు నిర్వహించారు. అనంతరం మండప దేవతా హోమాలు నిర్వహించారు. ప్రాయశ్చిత్త హోమం అనంతరం పూర్ణాహుతి నిర్వహించి మూడు రోజుల పాటు శాస్త్రోక్తంగా నిర్వహించిన పవిత్రోత్సవాలను ముగించారు. అనంతరం కలశానికి ఉద్వాసన చేసి కలశాలలోని పుణ్యజలాలతో స్వామివారికి అవభృత అభిషేకం నిర్వహించారు. మూడు రోజులపాటు స్వామివారికి ధరింపచేసిన పవిత్రాలను తొలగించి స్వామివారికి విశేషాలంకారం చేసి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు బోల్తా

ప్రయాణికులంతా సురక్షితం



విజయపురిసౌత్: హైదరాబాద్ నుంచి మాచర్ల వస్తున్న ఆర్టీసీ బస్సు నాగార్జునసాగర్–మాచర్ల ప్రధాన రహదారి ఏకోనాంపేట వద్ద సోమవారం ఉదయం అదుపు తప్పి బోల్తా పడింది. మాచర్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న 11 మంది ప్రయాణికులతోపాటు డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. ఉదయం 4 గంటలకు ప్రమాదం జరగగా సమాచారం అందుకున్న విజయపురిసౌత్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. త్రుటిలో ప్రమాదం నుంచి ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడటంతో ఊపిరిపీల్చుకున్నారు.

రంగస్థలం.. శిథిలం

- రేపల్లెలో కనుమరుగైన ఓపెన్ ఎయిర్ థియేటర్లు
- రాష్ట్రస్థాయి నాటక పోటీల ప్రదర్శనకు రేపల్లె ప్రసిద్ధి
- వేదికలు లేక 14 ఏళ్లుగా నిలిచిపోయిన పోటీలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ప్రకాశం పాఠశాలలో శిథిలావస్థకు చేరిన కళావేదిక (ఫైల్)

రేపల్లె రూరల్: సత్య హరిశ్చంద్ర నాటకంలో ఉద్వేగభరితమైన సంభాషణలు, చింతామణి నాటకంలోని హాస్యభరిత కేరింతలు, శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ జీవిత చరిత్ర నాటికలోని విషాద ఘటనలు.. బుర్రకథలు, హరికథల్లో లీనమయ్యే ప్రేక్షకుల కరతాళ ధ్వనులు.. విజిలేస్తూ కేరింతలు.. ఇవన్నీ రేపల్లె ప్రాంతంలో గత స్మృతులు గానే మిగిలిపోయాయి. ప్రదర్శించేవారు, చూసేవారు ఉన్నా రంగస్థల వేదికలు(ఓపెన్ ఎయిర్ థియేటర్లు) లేకపోవడంతో రేపల్లె ప్రాంతంలో కళా ప్రదర్శనలు నిలిచిపోయాయి.

80,90లలో స్వర్ణయుగం..

కళారంగానికి పుట్టినిల్లయిన రేపల్లె పాత తాలూకాలో నాటక రంగ ప్రదర్శనలకు గతంలో నిర్మించిన కళావేదికలు శిథిలమైపోయాయి. ఎంతో ఘన చరిత్ర కలిగిన కళారంగాన్ని, కళాకారులను ప్రోత్సహించేందుకు 1982వ సంవత్సరంలో అప్పటి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మైనేని సీతారామయ్య హయాంలో ప్రకాశం ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను నిర్మించాలని తీర్మానించారు. దీనికోసం ఓపెన్ థియేటర్‌కు 804చదరపు మీటర్ల స్థలాన్ని కేటాయించారు. ఆ స్థలంలో కళావేదికను నిర్మించటంతో అప్పటి నుంచి నాటక ప్రదర్శనలు జోరుగా సాగుతుండేవి.

వేదికలపై సినీనటుల ప్రదర్శనలు..

రేపల్లె ప్రకాశం స్కూలులోని ఓపెన్ ఎయిర్ థియేటర్ కళావేదికపై ప్రముఖ సినీనటులు నాగభూషణం, రమాప్రభ, శారద, స్వరాజ్యలక్ష్మి, శరత్ బాబు, పద్మనాభం, జయప్రకాశ్‌రెడ్డి వంటి నిష్ణాతులైన నటులు రక్తకన్నీరు, బికారి రాముడు, కుటుంబ గౌరవం, శ్రీకాళహస్తి మహత్యం వంటి పలు నాటకాలలో అద్భుత పాత్రలను పోషించి ప్రేక్షకులను అలరింపజేశారు. ఈ కళావేదికలో రేపల్లెకు చెందిన రసాలయ కళాసమితి 60కు పైగా నాటికలు ప్రదర్శించి ప్రేక్షకుల ఆదరణ పొందింది. వీటితో పాటు అనేక సాంఘిక, పౌరాణిక నాటకాలలో అప్పటి ప్రఖ్యాత నటులు ఆంజనేయరాజు, బేతాళ వెంకట్రావులు పలు పాత్రలను పోషించి ప్రేక్షకులలో సుస్థిరస్థానాన్ని ఏర్పరుచుకున్నారు.

మరో థియేటర్ నిర్మాణంతో...

1995వ సంవత్సరంలో అప్పటి మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న దాసరి కృష్ణకుమారి హయాంలో పట్టణంలో రెండో కళావేదికను ఏర్పాటు చేయాలనే తలంపుతో అప్పటి కౌన్సిల్ తీర్మానం మేరకు 11వ వార్డులోని ఆంధ్రరత్న మున్సిపల్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో మరో ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను ఏర్పాటు చేశారు. కొత్త ఓపెన్ థియేటర్ అందుబాటులోకి రావటంతో ప్రకాశం మున్సిపల్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలోని కళావేదిక శిథిలావస్థకు చేరింది. ఆంధ్రరత్న అప్పర్ ప్రైమరీలోని కళావేదికపై కొంత కాలం నాటికలు ప్రదర్శితమైనా.. కాలక్రమంలో ప్రేక్షకులు తగ్గిపోయి.. కళాప్రదర్శనలు సైతం తగ్గి కళావేదికను పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో పట్టణంలో ప్రసిద్ధిగాంచిన రెండు కళావేదికలు శిథిలావస్థకు చేరాయి.

వినతులు బుట్టదాఖలు..

ప్రకాశం మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాల, ఆంధ్రరత్న మున్సిపల్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలోని కళావేదికలను అభివృద్ధి చేసి కళారంగానికి జీవం పోయాలని ప్రజాసంఘాల నేతలు, కళాకారులు చేసిన వినతులు బుట్టదాఖలయ్యాయి. కళావేదికను అభివృద్ధి చేయాలని పలువురు ప్రజాప్రతినిధులతో పాటు జిల్లాస్థాయి అధికారులకు పలుసార్లు వినతిపత్రాలు సమర్పించారు. అయినప్పటికీ ఆ కళావేదిక సమస్య సమస్యగానే మిగిలిపోయి వీటి నిర్మాణాలు కలగానే మిగిలిపోయాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఓపెన్ ఎయిర్ థియేటర్లను అభివృద్ధి చేసి కళారంగ అభివృద్ధికి చేయూతనివ్వాలని కళాకారులు, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

14 ఏళ్లుగా ప్రదర్శనలు లేవు...

కళావేదికలు లేకపోవటంతో నాటిక ప్రదర్శనలు సైతం జరగడం లేదు. ప్రతి ఏడాది రేపల్లె రసాలయ కళాసమితి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఆహ్వాననాటిక పోటీలను నిర్వహిస్తూ కళాకారులను ప్రోత్సహిస్తూ కళారంగ అభివృద్ధికి చేయూతనిస్తుంటారు. అయితే పట్టణంలోని రెండు కళావేదికలు శిథిలమవడంతో ప్రతి ఏటా నిర్వహించే నాటిక ప్రదర్శనలు నిలిచిపోయాయి. గత 14 సంవత్సరాల నుంచి నాటక ప్రదర్శనలు, పోటీలు నిర్వహించిన దాఖలాలు లేవు.



ఆంధ్రరత్న అప్పర్ ప్రైమరీ మున్సిపల్ పాఠశాలలో శిథిలమైన కళావేదిక (ఫైల్)

ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించాం..



పట్టణంలో ఆంధ్రరత్న మున్సిపల్ స్కూల్, ప్రకాశం స్కూలులో ఓపెన్ ఎయిర్ థియేటర్లు శిథిలావస్థకు చేరడంతో వాటిని తొలగించటం జరిగింది. ప్రకాశం పాఠశాలలో త్వరలో ఓపెన్ ఎయిర్ థియేటర్ ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందిన వెంటనే కళావేదికను పునర్నిర్మిస్తాము.

– శేషాద్రి, మున్సిపల్ కమిషనర్, రేపల్లె

ఆవాసాలు బుగ్గిపాలు

కర్లపాలెం లంకకాలువ కట్టపై 9 పూరిళ్లు దగ్ధం



అగ్ని కీలల్లో గిరిజనుల పూరిళ్లు

- కట్టుబట్టలతో మిగిలిన నిరుపేద గిరిజనులు
- బాధితులను పరామర్శించిన కలెక్టర్ వెంకట మురళి, ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు

కర్లపాలెం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తొమ్మిది పూరిళ్లు దగ్ధమైన సంఘటన బాపట్ల జిల్లా కర్లపాలెం మండల కేంద్రంలోని లంక కాలువ కట్టపై సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు లంక కాలువ కట్టపై నిరుపేద గిరిజనులు పూరిళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని వీరు రోజూ మాదిరిగానే ఉదయాన్నే పొలం పనులకు, చెరువుల వద్ద కాపాలా ఉండేందుకు వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు క్షణాల్లోనే పెద్దఎత్తున ఎగసి పక్కన ఉన్న గృహాలకు కూడా అంటుకోవటంతో మరో గృహంలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలి మంటలు ఉవ్వెత్తున ఎగసి క్షణాల్లో తొమ్మిది ఇళ్లకు అంటుకున్నాయి. ప్రమాదంలో ఈగా కల్పన, దాసరి ఈశ్వరి, కొమ్మరగిరి శివయ్య, చవుటూరి కోటేశ్వరరావు, తుపాకుల తిరుమలేశ్వరరావు, గంధం వెంకటేశ్వరమ్మ, నక్కా సుబ్బారావు, ఈగా పెద్దియ్య, కోనేటి పోతురాజులకు చెందిన పూరిళ్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో గత ప్రభుత్వంలో జగనన్న కాలనీలో ఇచ్చిన ఇళ్ల స్థలాల పట్టాలు, ఆధార్, రేషన్ కార్డులు, దుస్తులు, వంటపాత్రలు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకుని ఇళ్లకు చేరుకున్న గిరిజనులు నల్లని బొగ్గులా మారిన తమ గృహాలను, వంటపాత్రలను చూసి బోరున విలపిస్తున్న తీరు చూపరులను సైతం కంటతడి పెట్టించింది. కాయకష్టం చేసుకుని ఖర్చులకోసం దాచుకున్న కొద్దిపాటి నగదు కూడా కాలిపోయిందని బాధితులు రోధిస్తున్నారు. ఈగా పెద్దియ్య అనే యువకుడు తన వివాహానికి దాచుకున్న రూ.70వేల నగదు గృహంలో కాలిపోయిందని వాపోయాడు.

బాధితులకు ఎమ్మెల్యే ఆర్థికసాయం..

అగ్ని ప్రమాద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు చెప్పారు. బాధితులకు తక్షణ సహాయంగా వేగేశన ఫౌండేషన్ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ప్రముఖ ఆక్వా వ్యాపారి, రైతు వెంకట నారాయణ బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.10వేలుచొప్పున అందజేస్తామని తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు బాధితులకు నివాస గుడారాలు అందజేశారు.

ప్రభుత్వపరంగా ఆదుకుంటాం: కలెక్టర్ వెంకట మురళి

అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుని పక్కా గృహాలు నిర్మిస్తామని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. ప్రమాదం విషయం తెలుసుకున్న ఆయన హుటాహుటిన జాయింట్ కలెక్టర్ సుబ్బారావు, ఆర్డీఓ గంధం రవీందర్‌తో కలసి ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. దగ్ధమైన గృహాలను పరిశీలించి తక్షణ సహాయంగా బాధితులకు ఒక్కొక్కరికీ రూ.5వేల నగదు, 25కేజీల బియ్యం, కందిపప్పు, దుప్పట్లు, దుస్తులు అందజేశారు. సీఎం సహాయ నిధి నుంచి ఒక్కో కుటుంబానికి రూ.40వేల ఆర్థికసాయం అందేలా కృషి చేస్తామని భరోసానిచ్చారు. బాధితులందరికీ జగనన్న కాలనీలో పక్కా గృహాలు నిర్మించి ఇచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. సత్వరం స్పందించిన తహసీల్దార్ వెంకటరత్నం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్వో సాంబయ్యలను కలెక్టర్ అభినందించారు.



అగ్ని బాధితులకు దుస్తులు, నగదు అందజేస్తున్న కలెక్టర్ వెంకట మురళి, జేసీ



భట్టిప్రోలు మండలం వెల్లటూరు గీతాజ్ఞాన మందిరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కొల్లూరులో ఉట్టికొట్టే యత్నంలో విద్యార్థిని

హే కృష్ణా ముకుందా.. మురారీ

శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను జిల్లాలో గ్రామగ్రామాన ఘనంగా జరుపుకొన్నారు. చిలిపి కృష్ణుడు, గోపికల వేషాలు ధరించిన చిన్నారులు సందడి చేశారు. అన్ని గ్రామాల్లో దేవాలయాలు, ముఖ్య కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన ఉట్టిని కొట్టేందుకు యువతీ, యువకులు పోటీపడ్డారు.. భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా, పలు చోట్ల నగర సంకీర్తన నిర్వహించారు.

చేర్చుకోండి.. చెప్పింది చేస్తాం!

- సిఫారసు లేఖల కోసం కూటమి నేతల చుట్టూ అధికారుల ప్రదక్షిణలు
- సొంత ఊళ్లో కాకపోయినా.. సమీప ప్రాంతంలోనైనా పోస్టింగ్‌ల కోసం ముమ్మర యత్నాలు



చీరాల: సార్ ఒక్క అవకాశం ఇవ్వండి.. మీరు చెప్పినట్లే వింటాం. మీ కనుసన్నలల్లోనే నడుచుకుంటాం.. మీకు తెలియకుండా ఏ పనీ చేయం అంటూ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు కొందరు ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మమ్మల్ని మీ నియోజకవర్గంలో చేర్చుకోండి, మీరు చెప్పింది చేస్తాం అంటూ ఉదయం, సాయంత్రం ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలల్లో అధికారులు పడిగాపులు కాస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజల కంటే సిఫారసుల కోసం వచ్చే అధికారులే ఎక్కువగా ఉండడం విశేషం. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. జిల్లాలో ఇద్దరు మంత్రులు కూడా ఉండడంతో సిఫారసుల లెటర్లు కోసం వచ్చే వారి సంఖ్య కూడా ఎక్కువగా ఉండడం గమనార్హం.

నేతల చుట్టూ ప్రదక్షిణలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటీవల ఉద్యోగుల బదిలీలలో మార్గదర్శకాలను జారీ చేసింది. 2024 జూలై 31 నాటికి ఒకోచోట ఐదేళ్లు సర్వీస్ పూర్తి చేసిన వారికి తప్పనిసరిగా బదిలీకి మార్గం సుగమం చేసింది. మొత్తం 12 శాఖల్లో బదిలీలు చేపట్టేలా మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో లెటర్లకు భలే డిమాండ్ ఉంది. తమకు నచ్చిన స్థానాలను దక్కించుకునేందుకు ఉద్యోగులు ఎమ్మెల్యే సిఫారసు లెటర్ల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎమ్మెల్యేలతో సన్నిహితంగా ఉండే మండల స్థాయి నేతలు కొందరు బదిలీలపై భరోసా ఇస్తున్నారు. ఉద్యోగులకు మాటిస్తూ కొంత మేర కార్యకలాపాలు సాగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ప్రధాన శాఖల పోస్టింగులే కీలకం..

ప్రభుత్వ శాఖలలో కీలకంగా ఉన్న పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల్లో ఎక్కువగా పోస్టింగ్‌ల కోసం అధికారులు సిఫారసుల కోసం వస్తున్నారు. పోలీసు శాఖలో ఇప్పటికే పోస్టింగ్‌ల కోసం సిఫారసు లెటర్ల కోసం ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. అలానే రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల్లో కూడా కీలక పోస్టింగ్‌ల కోసం వస్తున్నారు. ఇటీవల రెవెన్యూ శాఖలో పోస్టింగ్‌ల కోసం ముమ్మర ప్రయత్నాలు చేశారు. పెద్ద పోస్టులకు సైతం సాక్షాత్తు మంత్రుల నుంచే పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నారు. సొంత ఊరిలో కాకపోయినా సమీప ప్రాంతంలో అయినా పోస్టింగ్‌లు ఇప్పించాలని కోరుతున్నారు. జిల్లాలో మారుమూల ప్రాంతం నుంచి సొంత ఊరికి దగ్గరలోనైనా పోస్టింగ్‌లు కావాలని కొందరు, పరస్పర అంగీకార బదిలీల కోసం మరికొందరు ప్రదక్షిణలు చేస్తున్నారు. పెద్దస్థాయిలో పోస్టింగ్‌ల కోసం మంత్రుల వద్దకు కూడా వెళ్లి లెటర్లు తెచ్చుకుంటున్నారు. జిల్లాలో విద్యుత్ శాఖ, రెవెన్యూ శాఖ మంత్రులు కూడా ఉండడంతో జిల్లాలో ఇదే తంతు నడుస్తుంది. మంత్రుల వద్ద నుంచి సిఫారసు లెటర్లు తీసుకువచ్చి ఎమ్మెల్యేల ద్వారా చెప్పించుకుంటూ పోస్టింగ్‌లు కోసం కృషి చేస్తున్నారు.

కులం కార్డు కలిసొచ్చేనా.. ?

ప్రభుత్వం పలు శాఖలలో బదిలీల కోసం మార్గదర్శకాలు జారీ చేయడంతో ఎప్పటి నుంచో బదిలీల కోసం ఎదురు చూస్తున్న వారు, సొంత ఊరిలో పనిచేసేందుకు కొందరు సిఫారసు లెటర్లు తెచ్చుకుంటున్నారు. ఎమ్మెల్యేలు, వారి బంధువులు, ఎమ్మెల్యేలతో సన్నిహితంగా ఉండేవారితోనూ, పార్టీలో ఎక్కువ కాలం ఉన్నవారితోనూ తమ పని చేసిపెట్టాలంటూ వారిని కూడా బుజ్జగిస్తున్నారు. ఇదిలా ఉంటే సామాజికవర్గం వారీగా కూడా తమ వారికే పోస్టింగ్‌లు ఇవ్వాలంటూ కొందరు కులం కార్డును తెరపైకి తెస్తున్నారు. పోస్టింగ్‌లు దక్కకపోయినా డిప్యుటేషన్ అయినా ఫర్వాలేదంటూ పట్టుపడుతున్నారు. తమకు నచ్చని అధికారి వచ్చినా కూటమి నేతలు చెప్పి అడ్డుకుంటున్నారు. ఎన్నికల బదిలీలలో వచ్చిన వారు అనంతరం జరిగిన బదిలీలలో వెళ్లిపోయినా కొంత మంది మాత్రం ఎమ్మెల్యేల అండదండలతో మళ్లీ కొనసాగడం విశేషం.

క్లుప్తంగా

సాగునీరు పారక కాలువ కట్టకు గండి



కొల్లూరు: కొల్లూరు ఎస్సీ కాలనీలో స్లూయిజ్ చానల్ నుంచి తూము ద్వారా ఇందిరానగర్ వైపు పొలాలకు నీరు వెళ్లాల్సి ఉండగా తూము ధ్వంసమై నీటి ప్రవాహం నిలిచిపోయింది. పంటలకు నీరందకపోవడంతో రైతులు కాలువ కట్టకు గండి కొట్టి నీరు మళ్లించుకుందామనుకున్న ప్రయత్నం బెడిసికొట్టింది. గండి ద్వారా నీరు ప్రవహించక పోగా ఆప్రాంతంలోని నివాస ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర అవాంతరం ఏర్పడింది. నీటి పారుదల శాఖాధికారులు స్పందించి నీటి ప్రవాహం సజావుగా జరిగేలా చర్యలు చేపట్టడంతోపాటు, కాలువ కట్ట పూడ్చి రాకపోకలు పునరుద్ధరణ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మూడు బుసక ట్రాక్టర్లు పట్టివేత



కొల్లూరు: అక్రమంగా బుసక తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పోతార్లంక ప్రాంతంలో బుసక లోడ్‌తో వస్తున్న మూడు ట్రాక్టర్లను ఇసుక, బుసక అక్రమ రవాణా నియంత్రణ కోసం నియమించిన పోలీసు, రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో కూడిన బృందం నిలువరించింది. అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించిన నిఘా బృందం కొల్లూరు పోలీసులకు ట్రాక్టర్లను అప్పగించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ అర్జున్ తెలిపారు.

ప్రత్యేక రక్షణ విభాగం ఉండాలి



ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం తాపత్రయ పడుతూ, ప్రాణాలు కాపాడే వైద్య సిబ్బంది రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలి. టోల్‌ఫ్రీ నంబరును కేటాయించి ఆపదలో ఉన్న, లైంగిక వేధింపులకు గురవుతున్న వైద్యులు, వైద్య సిబ్బంది ఫోన్ చేసిన వెంటనే కాపాడేలా వ్యవస్థను అందుబాటులో ఉంచాలి.

– చల్లా మేరి మెటిల్డా, హెల్త్ అసిస్టెంట్, ఈపూరులంక, కొల్లూరు మండలం



కఠినంగా వ్యవహరించాలి



ప్రాణాలు పోసే వైద్యులపై అత్యంత క్రూరంగా అత్యాచారాలకు తెగబడటం, దాడులకు పాల్పడి హత్యలు గావించడం వంటి సంఘటనల వల్ల వైద్య వృత్తిలో ఉన్న మేము నిరంతరం భయం భయంగా విధులు నిర్వహించాల్సి వస్తుంది. వైద్య వృత్తిలో ఉన్న మహిళా సిబ్బందిపై బయట వ్యక్తులే కాకుండా, ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లోని అదేవృత్తిలో ఉన్న మృగాళ్ల నుంచి ఎదురవుతున్న లైంగిక వేధింపులపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరించాలి.

– పీఎస్‌బీ కుమారి, ఏఎన్ఎం, అనంతవరం సచివాలయం

పేరు మారింది.. తీరు మారింది

- సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ టెస్ట్‌గా ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్ష
- గతంలో మూడురోజులు.. ఇక ఆరు రోజులు
- నేటి నుంచి పరీక్షలు
- షెడ్యూల్ విడుదల చేసిన విద్యాశాఖ



పిట్టలవానిపాలెం: పాఠశాల స్థాయిలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు అంచనా వేసేందుకు నిర్వహించే యూనిట్ పరీక్షల పేరును విద్యాశాఖ మార్పు చేసింది. ఇంతవరకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ)గా ఉన్న యూనిట్ టెస్టులకు సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ (ఎస్ఏఎం)గా పేరు మార్చుతూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు విడుదల చేసింది. ఏడాదికి మూడు సార్లు నిర్వహించే యూనిట్ టెస్టులను ఇప్పటిదాకా రోజుకు రెండు పరీక్షల చొప్పున నిర్వహించేవారు. తాజా ఆదేశాల మేరకు ఇకనుంచి ఈ ఏఎస్ఎంలు ప్రతి రోజూ ఒక్కో సబ్జెక్టు వంతున ఆరురోజులపాటు కొనసాగిస్తారు. షెడ్యూల్ ప్రకారం ఈ పరీక్షలు ఈనెల 27వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీవరకు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేట్ మినహా అన్నిప్రభుత్వ అనుబంధ పాఠశాలలకు జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ(డీసీఈబీ)నుంచి ప్రశ్నాపత్రాలు సరఫరా కానున్నాయి.

మార్కుల నమూనాలో మార్పు లేదు..

యూనిట్ పరీక్షల స్థానంలో ఇంతవరకు నిర్వహిస్తున్న ఫార్మేటివ్ పరీక్షలకు 20 మార్కులకు మాత్రమే ఉండడంతో ఉదయం, మధ్యాహ్నం రెండేసి పరీక్షల చొప్పున నిర్వహించి మూడు రోజుల్లో పూర్తి చేసేవారు. తాజా మార్గదర్శకాల ప్రకారం ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో రోజు చొప్పున 6 రోజుల పాటు పరీక్ష జరపనున్నారు. అయితే దీనివల్ల ఏడాదిలో సిలబస్ పూర్తి చేయడానికి సమయం చాలదని, దీని ప్రభావం ఫైనల్ పరీక్షపై చూపుతుందని ఉపాధ్యాయ వర్గాలు వాపోతున్నారు. నెలవారీ సిలబస్‌లో 3 రోజులు కుదించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.

టోఫెల్ పరీక్షలు లేనట్లే..!

గత నెల 15న పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన 2024–25 అకడమిక్ క్యాలెండర్‌లో టోఫెల్ తరగతుల నిర్వహణకు ఎలాంటి పిరియడ్స్ కేటాయించలేదు. గత ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి వచ్చే ఏడాది జూలై వరకు టోఫెల్ తరగతులు నిర్వహించాలి. అయితే క్యాలెండర్‌లో లేకపోవడంతో ఈ ఏడాది కూటమి ప్రభుత్వం టోఫెల్ పరీక్షకు మంగళం పాడినట్లే కనిపిస్తోంది.

పరీక్షల షెడ్యూల్ ఇదీ..

ప్రాథమిక తరగతులకు ఉదయం 10.45 నుంచి 11.45 వరకు, ఉన్నత తరగతులకు పరీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈనెల 28న తెలుగు, 30న ఇంగ్లిష్, 31న గణితం, సెప్టెంబర్ 2న పరిసరాల విజ్ఞాన పరీక్షలు ఉంటాయి. ఉన్నత తరగతులకు 27న ఓఎస్ఎస్‌సీ, 28న తెలుగు, 30న హిందీ, 31న ఇంగ్లిష్, 2న గణితం, 3న జనరల్ సైన్సు, 4న సోషల్ సబ్జెక్టులపై పరీక్షలు ఉంటాయి.

అవధానంలో అందెవేసిన చేయి నారాయణం

ముగిసిన శతావధాన కార్యక్రమం



అవధాన దంపతులను సత్కరిస్తున్న పుట్టంరాజు దంపతులు

అద్దంకి: అవధానానికి చిరునామా నారాయణం బాలసుబ్రహ్మణ్యమని రిటైర్డ్ ఆర్జేడీ యు.దేవపాలన అన్నారు. పట్టణంలోని చిన్న శాంతయ్య పిచ్చిమ్మ గార్ల సేవా సదన్‌లో సాహితీ మిత్రమండలి, పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవధాన పురస్కార సభకు డాక్టర్ యు.దేవపాలన అధ్యక్షత వహించారు. శనివారం ప్రారంభమైన శతావధాన కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా దేవపాలన మాట్లాడుతూ అవధాన క్రీడలో అందెవేసిన చేయి నారాయణం అన్నారు. అవధానం ఒక పద్యక్రీడ అని, అందులో ఆరితేరిన అవధాని నారాయణం అని పేర్కొన్నారు. శ్రీరామచంద్ర మూర్తి మాట్లాడుతూ ఆశువుగా పద్యాలు చెప్పడం, సాహితీ పటిమకు అత్యున్నతమైన పరీక్ష అవధానమని చెప్పారు. అంశాలకు ఆశువుగా, చమత్కార భరితంగా పూరణలు చేయడంలోనూ, సరస సంభాషణలు, చతురోక్తులతో అవధాన ప్రక్రియను నడపడంలోనూ నారాయణం సిద్ధహస్తుడన్నారు. ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించడం అద్దంకి వాసుల అదృష్టంగా భావించవచ్చనని సంచాలకులు పోలూరి వెంకటశివరామ ప్రసాద్ అన్నారు. డాక్టర్ తాళ్లూరి ఆంజనేయులు మాట్లాడారు. చివరలో నారాయణం దంపతులను పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజలు జ్ఞాపికనిచ్చి దుశ్శాలువాతో సత్కరించి రూ. 10 వేలు అందించారు. సన్మాన పత్రాన్ని ప్రముఖ నటుడు వారణాసి రఘురామశర్మ, చుండూరి మురళీ సుధాకరరావు అందించారు. కార్యక్రమంలో గాడేపల్లి దివాకర దత్తు, పాలపర్తి జ్యోతిష్మతి, డీవీఎం సత్యనారాయణ, ఇలపావులూరి శేష శ్రీధరశర్మ, మానేపల్లి నాగకుమారశర్మ, ఎం.కిషోర, ఐలవరం వీరాంజనేయులు, దుర్భా కౌండిన్యశాయి, చివుకుల వెంకటా చలపతి, మద్దాలి శ్రీనివాస్, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

ఖోఖో ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన అండర్-14 బాలుర జట్టు



ఎంపికైన అండర్-14 బాలికల జట్టు

జే.పంగులూరు: ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్–14 విభాగంలో బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. సోమవారం స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణ జూనియర్ కళాశాలలో, ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో ఈఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ ఎంపికకు జిల్లా నలుమూల గ్రామాల నుంచి 100 మంది బాలురు, 50 మంది బాలికలు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి తెలిపారు. ఎంపికలో జిల్లా కార్యదర్శి బి.కాశీవిశ్వనాథరెడ్డి, ట్రెజరర్ హనుమంతురావు, పీడీలు రమాదేవి, వసంత రఘుబాబు, సావిత్రమ్మ, శ్రీనివాసులు, సౌజన్య, కె.ప్రసాద్, వీరాంజనేయులు, అజయ్ పాల్గొన్నారు. ఎంపికైన బాలుర జట్టుకు ఈ నెల 27 నుంచి ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ జరుగుతుందని తెలిపారు. బాలబాలికల జట్లను టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, రోటరీ క్లబ్ సభ్యుడు చిలుకూరి వీరరాఘవయ్య అభినందించారు. ఖోఖో పోటీలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

అ'పూర్వ' ఆత్మీయ సమ్మేళనం



ఎస్ఎస్ఎల్‌సీ పేరాల ఏఆర్‌పి హెచ్‌ఎం స్కూల్ ఆఖరి బ్యాచ్ పూర్వ విద్యార్థులు

- 55 ఏళ్ల తర్వాత కలుసుకున్న ఎస్ఎస్ఎల్‌సీ ఆఖరి బ్యాచ్ విద్యార్థులు
- భావోద్వేగానికి గురైన స్నేహితులు

చీరాల టౌన్: ఒకప్పటి ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులు 55 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ నాడు జరిగిన ఘటనలను తలుచుకుంటూ ఉబ్బితబ్బిబ్బయ్యారు. 55 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఒక్కసారిగా కలుసుకోవడంతో అక్కడంతా భావోద్వేగాలు రాజ్యమేలాయి. తమ స్నేహితులను ఐదు దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో ప్రతి ఒక్కరూ కన్నీళ్ల పర్యంతమయ్యారు. ఈ ఘటనలకు తాము చదివిన పేరాల ఏఆర్‌పి హెచ్‌ఎం హైస్కూల్ వేదికగా నిలిచింది. 1968–69 ఎస్ఎస్ఎల్‌సీ ఆఖరి బ్యాచ్ చదివిన విద్యార్థులందరూ తాము పాఠశాలలో చదివి 55 ఏళ్ల పూర్తయిన సందర్భంగా సోమవారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆనాటి పదోతరగతి విద్యార్థులందరూ హాజరై ఒకరినొకరు పలకరించుకుంటూ అప్పటి సంగతులను గుర్తుకు తెచ్చుకున్నారు. వీరిలో కొందరు వ్యాపారవేత్తలు, కొందరు త్రివిధ దళాల్లో పని చేసిన వారు, టీచర్లుగా పనిచేసినవారు ఉన్నారు. తాము ఉన్నత స్థానాలలో ఉండేలా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్మరించుకున్నారు. ప్రస్తుత హైస్కూల్ హెచ్ఎం బి.సాల్మన్‌రాజ్‌కు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం చదువుల్లో ప్రతిభ చూపిన పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు గోలి దేవేంద్రనాథం, అమర్‌నాథ్, శ్రీకృష్ణ, భుజంగరావు, జోనేష్, వీరయ్య, నాగేశ్వరరావు, మదనగోపాలరావులు పర్యవేక్షించారు.

విజ్ఞాన్ నిరుల అధ్యాపకులకు అవార్డులు



అవార్డులు పొందిన అధ్యాపకులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: తమ కళాశాల అధ్యాపకులకు విప్రో ధ్రువీకృత అవార్డు రావడం సంతోషంగా ఉందని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన అధ్యాపకుల అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఐటీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వి. పావనికి ఉపాధ్యాయుల విభాగంలో ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ సమ్మిట్– 2024లో డిజిటల్ ఇన్నోవేటర్స్ ఆఫ్ టుమారో అవార్డు లభించిందన్నారు. డాక్టర్ వి పావని, జి రోహిణి ఫణీంద్రకుమారిలను విప్రో సంస్థ తమ ధ్రువీకృత అధ్యాపకులుగా గుర్తించి అవార్డును అందజేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో తమ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు మరెన్నో సాంకేతిక ఆవిష్కరణలు చేసే దిశగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి గుర్తింపుతో పాటు డిజిటల్ ఇన్నోవేషన్ రంగంలో అగ్రస్థాయిలో ఉన్న కళాశాలగా విజ్ఞాన్ నిరుల గుర్తింపబడటం గొప్ప విషయమని కళాశాల ఐటీ విభాగాధిపతి డాక్టర్ కె.వి.ఎస్.ఎస్. రామకృష్ణ, కళాశాల ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ సమన్వయకర్త డాక్టర్ కె.సత్యసందీప్ తెలిపారు. చివరగా అవార్డులు పొందిన అధ్యాపకులను పలువురు అభినందించారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న పాండురంగ వరప్రసాదరావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యారంగాన్ని బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు అన్నారు. కన్నావారితోటలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం గుంటూరు జోన్ కన్వీనర్ కేసన రమేష్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాండురంగ వరప్రసాదరావు మాట్లాడుతూ జీవో 117 రద్దు చేయాలని కోరారు. 3,4,5 తరగతుల్ని ఉన్నత పాఠశాలల నుంచి వెనక్కు తీసుకుని ప్రాథమిక పాఠశాలల్లో ప్రారంభించడం ద్వారా ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రంలో ఒక్క తెలుగు మీడియం తప్పా ఒరియా, కన్నడ, తమిళ్, ఉర్దూ తదితర మాధ్యమాల్లో చదువుకోవడం తెలుగు విద్యార్థులు చేసుకున్న దురదృష్టమన్నారు. తక్షణమే తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. ఉపాధ్యాయులు వృత్తికి పునరంకితం కావడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్ని కాపాడుకోవాలని సూచించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ విద్యాశాఖాధికారుల నిర్ణయాలతో మిగులు ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియ గందరగోళానికి దారితీసిందని విమర్శించారు. ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకుడు షేక్ జిలానీ మాట్లాడుతూ డీఏ పెండింగ్ బకాయిలు విడుదలతో పాటు ప్లస్ 2 పాఠశాలల్లో ఖాళీల్ని వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఫిరంగిపురం, తాడికొండ మండలాల నుంచి ఎస్టీయూ శాఖ కార్యకర్తలు, నాయకులు టి.భాస్కర్, చక్కా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కబీర్, జహంగీర్, జఫరుల్లా, వెంకటేశ్వర్లు, అప్పారావు తదితరులు ఏపీటీఎఫ్‌లో చేరారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లా ఉపాధ్యక్షులు పి.లక్ష్మీనారాయణ, పి.పార్వతి, జిల్లా కార్యదర్శి లు ఎస్.ఎస్.ఎన్ మూర్తి, జి.దాస్, రాష్ట్ర కౌన్సిలర్ చెత్తిపోగు లక్ష్మణ్ కుమార్, జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి హనుమంతరావు పాల్గొన్నారు.

29న జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపికలు

చీరాల రూరల్: ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో ఈనెల 29 మధ్యాహ్నం 3:30 గంటలకు జిల్లా ఫుట్‌బాల్ మెన్, ఉమెన్ సీనియర్స్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసిమల్లి విజయకుమార్, జోనల్ ఇన్‌చార్జ్ నూతలపాటి దేవదాసు, క్యాంప్ ఇన్‌చార్జ్ బొనిగల ప్రేమయ్యలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలక్షన్స్‌కు హాజరయ్యే క్రీడాకారులు తమవెంట ఆధార్ కార్డులు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు తెచ్చుకోవాలని సూచించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని వారు కోరారు.

మైనర్‌పై పోక్సో కేసు నమోదు

తాడికొండ: మైనర్ బాలికను ప్రేమ పేరుతో ఓ మైనర్ బాలుడు వేధించిన ఘటన తాడికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికొండలో ఓ మైనర్ బాలికపై సమీపంలోని ఇంటికి చెందిన మరో మైనర్ బాలుడు ప్రేమ పేరుతో వేధించడంతో పాటు అసభ్యంగా ప్రవర్తిస్తుండగా కేకలు వేసింది. కుటుంబ సభ్యులు గమనించి పట్టుకునేందుకు యత్నించగా నిందితుడు పారిపోయాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె. వాసు తెలిపారు.

ఎల్ఐసీ జోనల్ గేమ్స్ చీఫ్ రిఫరీగా అబ్దుల్ జలీల్



గుంటూరు వెస్ట్ (క్రీడలు): వైఎస్సార్ కడపలో ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న ఎల్ఐసీ ఆఫ్ ఇండియా జోనల్ క్రీడా పోటీలకు చీఫ్ రిఫరీగా గుంటూరుకు చెందిన ప్రముఖ క్యారమ్స్ క్రీడాకారుడు షేక్ అబ్దుల్ జలీల్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఎల్ఐసీ కార్యాలయం నుంచి ఆయనకు ఆదేశాలందాయి. గతంలో జలీల్ భారత క్యారమ్స్ జట్టు సభ్యునిగానూ, ఇండియా జట్టు కోచ్‌గానూ పని చేశారు. 2013లో కోల్‌కతాలో జరిగిన ఏడు దేశాల సార్క్ క్యారమ్స్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు బంగారు పతకం గెలుపొందింది. ఈ జట్టుకు కోచ్‌గా జలీల్ వ్యవహరించారు. ప్రస్తుతం జలీల్ ఆంధ్ర రాష్ట్ర క్యారమ్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఎల్ఐసీ సంస్థతో కూడా ఆయనకు అనుబంధముంది.

ఉపాధ్యాయుడు కోటేశ్వరరావుకు 'మదర్ సర్వీస్' అవార్డు



కోటేశ్వరరావుకు అవార్డును ప్రదానం చేసి సత్కరిస్తున్న మదర్ సర్వీస్ సొసైటీ సభ్యులు

చెరుకుపల్లి: సేవా భావం కలిగిన వ్యక్తులకు తగిన గుర్తింపు, గౌరవం దక్కుతాయని అందుకు నిదర్శనమే ఉపాధ్యాయుడు మరదాప కోటేశ్వరరావు అని మండల విద్యాశాఖ అధికారి పులి లాజర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ గుర్తింపు పొందిన మదర్ సర్వీస్ సొసైటీ వారు సంస్థ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, ఒడిశా, తమిళనాడు ఐదు రాష్ట్రాలకు చెందిన స్వచ్ఛంద సేవకులకు జాతీయ అవార్డు ప్రదాన కార్యక్రమం విజయవాడలో సోమవారం నిర్వహించారు. ఆరేపల్లి ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మరదాప కోటేశ్వరరావు సైతం అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావును ఎంఈఓ-2 టి.నవీన్‌కుమార్, జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు కాటూరి నాగేశ్వరరావు, యూటీఎఫ్ నాయకుడు బి.సాంబయ్య నాయక్, తదితరులు అభినందించారు.

పేరలిలో రెండు వర్గాల మధ్య ఘర్షణ

కర్లపాలెం: బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం పేరలి గ్రామంలో సోమవారం రాత్రి రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కృష్ణాష్టమి సందర్భంగా ఓ సామాజిక వర్గం వారు డీజేతో ఊరేగింపు చేస్తూ బాణసంచా కాలుస్తుండగా బాణసంచా రవ్వలు మీద పడుతున్నాయని మరొక వర్గం వారు అభ్యంతరం తెలిపారు. దీంతో ఇరువర్గాల యువకుల మధ్య ఘర్షణ జరిగిందని ఈ ఘర్షణలో ఒక వర్గానికి చెందిన యువకుడికి తీవ్ర గాయమైంది. ఈ సంఘటనతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ పెద్దది కావటంతో సమాచారం అందుకున్న కర్లపాలెం ఎస్ఐ ఎస్.రవీంద్ర, బాపట్ల టౌన్ సీఐ జాని పేరలి గ్రామానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడి శాంతింపజేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కృష్ణా - ప్రకాశం మ్యాచ్ డ్రా

- బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించిన కృష్ణా జట్టు
- తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కృష్ణాకు ఆరు పాయింట్లు



ఆర్యన్‌సాయి, 149 పరుగులు, కృష్ణా జట్టు



జి.ఆదర్శ్, 5 వికెట్లు, కృష్ణా జట్టు

నరసరావుపేటఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్ నిర్వహిస్తున్న సెంటర్ జోన్ అంతర్ జిల్లాల అండర్–23 క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా కృష్ణా, ప్రకాశం జిల్లాల మధ్య మ్యాచ్ డ్రాగా ముగిసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 229 పరుగులకు ఆలౌట్ కాగా, ప్రకాశం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 210 పరుగులు చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేపట్టిన కృష్ణా జట్టు నిన్నటి ఓవర్‌నైట్ స్కోర్ ఆరు వికెట్లు నష్టానికి 159 పరుగులతో సోమవారం బ్యాటింగ్ కొనసాగించి 284 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని ఆర్యన్‌సాయి 239 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లతో 149 పరుగులు చేయగా, టి.సాయిప్రకాష్ 44 పరుగులు సాధించాడు. ప్రకాశం బౌలర్లు పి.నవీన్ 3, పి.దుర్గాబాలాజీ 4వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ప్రకాశం జట్టు ఆట ముగిసే సమయానికి 9 వికెట్ల నష్టానికి 252 పరుగులు చేసింది. జట్టులోని జి.రోహిత్ 84 పరుగులు చేయగా, కృష్ణా బౌలర్ ఆదర్శ్ ఐదు వికెట్లు సాధించాడు. మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యతతో కృష్ణాజిల్లా జట్టుకు ఆరు పాయింట్లు, ప్రకాశం జట్టుకు ఒక పాయింట్ లభించాయి. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.